
సాక్షి ఖమ్మం

గురువారం । 17 । జూలై । 2025



సొసైటీ.. ప్రగతిలో మేటి..
చింతకాని మండలంలోని నాగులవంచ పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలతో నాబార్డు అవార్డుకు ఎంపికైంది. 8లో



కొరవడిన పర్యవేక్షణ
బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్లపై డివిజన్ స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 35° / 24°
జిల్లాలో గురువారం ఎండ ప్రభావం పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం వేళ ఉష్ణోగ్రత తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/కూసుమంచి/సత్తుపల్లి టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు సత్తుపల్లిలో జరిగే ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా స్వయం సంఘాల బృందాలకు బ్యాంకు లింకేజీ రుణాలు చెక్కులను ఎమ్మెల్యే రాగమయితో కలిసి పంపిణీ చేశాక, పెనుబల్లి మండలం పాత కుప్పెనకుంట్లలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ఇల్లెందులో జరిగే మహిళా శక్తి సంబురాల్లో మరో మంత్రి సీతక్కతో కలిసి పొంగులేటి పాల్గొంటారు. అలాగే, సాయంత్రం సాయంత్రం 4 గంటలకు కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే పాలేరు నియోజకవర్గ స్థాయి మహిళా శక్తి సంబురాల సభలో మంత్రి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లోని 4,505 స్వయం సహాయక సంఘాలకు రూ.5.62 కోట్ల వడ్డీ లేని రుణాలు, 56 గ్రూపులకు రూ.44.90 లక్షల ప్రమాద బీమా చెక్కులు పంపిణీ చేస్తారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురు, శుక్రవారం ఖమ్మం నగరంలో పర్యటించనున్నారు. గురువారం సాయంత్రం 37వ డివిజన్‌లో రైల్వేస్టేషన్ రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే, శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొననున్న మంత్రి మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులు, రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు.

వెబ్‌సైట్‌లో ఎంపిక జాబితాలు

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ ఆరోగ్య మిషన్ విభాగం ద్వారా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సైకియాట్రిస్ట్, సపోర్ట్ ఇంజనీర్లను నియమించనుండగా జాబితా సిద్ధమైంది. ఈమేరకు ఎంపికైన వారి జాబితాలను https://khammam.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉన్న వారు ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సరైన ఆధారాలను తమ కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ డిపోల్లో మూడేళ్ల అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎం సరిరామ్ తెలిపారు. గ్రాడ్యుయేషన్, వివిధ కోర్సుల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారే కాక డిప్లొమా చదివిన వారూ అర్హులని వెల్లడించారు. 2021 విద్యాసంవత్సరం తర్వాత ఉత్తీర్ణులైన వారికి నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీం ద్వారా ఇచ్చే శిక్షణ కోసం ఈనెల 23వ తేదీలోగా నాట్స్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, శిక్షణ కాలంలో స్టైఫండ్ అందుతుందని ఆర్‌ఎం తెలిపారు.

రూ.100 కోట్లతో విద్యుత్ పనులు

కూసుమంచి: ఖమ్మం సర్కిల్ పరిధిలో విద్యుత్ శాఖాపరంగా రూ.100 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నామని ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. గురువారం కూసుమంచిలో సబ్‌స్టేషన్ల ఇంటర్ కనెక్టివిటీ పనులను బుధవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. సర్కిల్‌లోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లను అనుసంధానిస్తున్నామని, తద్వారా ఏదైనా సబ్‌స్టేషన్‌లో సమస్య ఎదురైతే ఇంకో చోట నుంచి సరఫరాకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు రూ.19 కోట్ల వ్యయంతో 190 కి.మీ.మేర లైన్లు ఏర్పాటు చేయగా, ఖమ్మం డివిజన్‌లోని 18, పాలేరు నియోజకవర్గంలో తొమ్మిది సబ్‌స్టేషన్ల అనుసంధానం పూర్తయిందని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి సమస్య ఎదురైతే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కూసుమంచిలో ట్రా న్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రానికి రూ.75లక్షలు మంజూరైనందున ప్రభుత్వ స్థలంకోసం రెవె న్యూ శాఖకు ప్రతిపాదించామని ఎస్‌ఈ తెలిపారు. డీఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యానాయక్, ఏఈలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో పరిశీలన

వేంసూరు: వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్‌పామ్ తోటలను ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. తోటల్లో ఆఫ్‌టైప్ మొక్కల కారణంగా నష్టపోయాయని పలువురు రైతులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో శాస్త్రవేత్తలు ఎంవీ.ప్రసాద్, రాంచంద్రుడు, కల్యాణ్‌తో పాటు ఆయిల్ ఫెడ్ ఓఎస్‌డీ అడపా కిరణ్, డీఓ శంకర్ పరిశీలించి వివరాలు సేకరించారు.



లెక్క తేలింది..

ఉమ్మడి జిల్లాలో ఎంపీటీసీ 516, జెడ్పీటీసీ స్థానాలు 42

- పునర్విభజన అనంతరం స్థానాల ప్రకటన
- త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో జోరు పెంచిన అధికార పక్షం
- ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఒక్కో అడుగు పడుతోంది. ఈ మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలతో పాటు మండల ప్రజా పరిషత్ స్థానాలను ప్రకటించింది. ఈ ప్రకారం ఖమ్మం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు 20 చొప్పున ఉండగా, ఎంపీటీసీ స్థానాలు 283గా వెల్లడైంది. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీలు 22 చొప్పున, ఎంపీటీసీ స్థానాలు 233గా లెక్క తేల్చారు. కాగా, ఖమ్మం జిల్లాలో గత ఎన్నికల్లో 289 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగగా, పునర్విభజనతో ఆ సంఖ్య తగ్గింది. అలాగే, మార్పులు, చేర్పుల అనంతరం ఖమ్మం జిల్లాలో 571 గ్రామపంచాయతీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 471 జీపీలు ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లపై పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లును గవర్నర్‌కు సమర్పించిన నేపథ్యాన, గవర్నర్ ఆమోదం పొందితే ఈనెలాఖరులోగా ఎప్పుడైనా స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని తెలుస్తోంది.

రెండు మున్సిపాలిటీల ఏర్పాటుతో..

ఖమ్మం జిల్లాలో 289 ఎంపీటీసీ స్థానాలకు గతంలో ఎన్నికలు జరిగాయి. అయితే, ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటుతో ఖమ్మం రూరల్ మండలంలోని కొన్ని గ్రామపంచాయతీలు అందులో విలీనమయ్యాయి. అలాగే రఘునాథపాలెం మండలంలోని ఎంపీటీసీ స్థానం ఖమ్మం రూరల్‌లో చేరింది. అంతేకాక కల్లూరు మున్సిపాలిటీ ఏర్పాటుతో ఐదు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఖమ్మంరూరల్, రఘునాథపాలెం మండలాలు కలిపి ఒకటి, కల్లూరు మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలు తగ్గడంతో జిల్లాలో 283గా ఖాయమయ్యాయి. అలాగే జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు 20 ఉన్నాయి. ఇవికాక ఏదులాపురం, కల్లూరులో విలీనమైన గ్రామపంచాయతీలను మినహాయిస్తే జిల్లాలో 571 గ్రామపంచాయతీలు, 5,214 వార్డులు ఉన్నట్లు లెక్క తేలింది. భద్రాద్రి జిల్లాలో 471 జీపీలు, 4,168 వార్డులు ఉన్నాయి.

ఇక ఎన్నికల సందడి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారైన నేపథ్యాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ప్రధానంగా అధికార పార్టీ నేతలు కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. అంతేకాక రిజర్వేషన్లు ఖరారు కాగానే అభ్యర్థులను ఎంపిక చేసేలా కసరత్తు మొదలుపెట్టారు.

ప్రభుత్వ కార్యక్రమాల జోరు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన ప్రభుత్వ కార్యక్రమాల జోరు పెరిగింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారు. ప్రధానంగా గ్రామ, మండల స్థాయిల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. మంత్రులు మండలాల వారీగా పర్యటిస్తూ మహిళా సంఘాలకు వడ్డీ రుణాల చెక్కులే కాక రేషన్‌కార్డుల పంపిణీ మొదలుపెట్టారు. ఇలా రకరకాలుగా ఓటర్లను ఆకట్టుకోవడంపై దృష్టి సారించారు. ఇదే సమయాన ఇతర పార్టీలు కూడా స్థానిక సంస్థల ఎన్నికలను దీటుగా ఎదుర్కొనేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

➡ ఎప్పుడైనా నోటిఫికేషన్..

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వేషన్లపై ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టసవరణ ఆమోదం కోసం ఆర్డినెన్స్ ముసాయిదాను గవర్నర్ ఆమోదానికి పంపింది. గవర్నర్ ఆమోదం పొందగానే చట్ట సవరణ అమల్లోకి వస్తుంది. తద్వారా ఈ రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ అవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈనెల 25లోగా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, ఆ తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు ఉంటాయని తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో స్థానాల వివరాలు

స్థానాలు	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
జెడ్పీటీసీలు	20	22
ఎంపీపీలు	20	22
ఎంపీటీసీలు	283	233
గ్రామపంచాయతీలు	571	471
వార్డులు	5,214	4,168

పెద్దాస్పత్రి కిటకిట



ఓపీ నమోదుకు బారులుదీరిన జనం

జిల్లా జనరల్ ఆస్పత్రి బుధవారం కిటకిటలాడింది. వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు దగ్గు, ఒంటి నొప్పులతో పలువురు బాధపడుతుండగా.. ఎండవేడితో కొందరు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారని తెలుస్తోంది. దీంతో చికిత్స కోసం పెద్దాస్పత్రి బాట పడుతున్నారు. గత వారం రోజులుగా 1,500 మందికి పైగా ఓపీ విభాగంలో చికిత్సకు వస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఎక్కువగా వృద్ధులు ఉంటున్నారని, ఇదే సమయాన ఇన్ పేషంట్లు పెరుగుతున్నారని తెలుస్తోంది. అయితే, వాతావరణంలో మార్పుల నేపథ్యాన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. – ఖమ్మం వైద్యవిభాగం

‘తపాలా’లో నూతన సాంకేతికత

- 22వ తేదీ నుంచి ఐటీ–2.0 అమలు
- 19, 21వ తేదీల్లో సేవలకు అంతరాయం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ నిర్వహణలో మార్పులు తీసుకొస్తున్నారు. సురక్షితమైన సేవల కోసం అధునాతన సాంకేతిక విధానం అమలుకు రంగం సిద్ధం చేశారు. తపాలా శాఖ కార్యాలయాల ద్వారా సేవలన్నింటినీ ఒకే ప్లాట్‌ఫామ్‌పై అమలుకు నిర్ణయించిన నేపథ్యాన ఐటీ–2.0 పేరుతో నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్ కార్యకలాపాల డేటా భద్రతను పెంచుతుందని చెబుతున్నారు. అలాగే, ఉద్యోగుల పని సామర్థ్యం పెరగడమే కాక సేవలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

తెలంగాణ సర్కిల్ అంతటా...

ఐటీ–2.0ను ఈనెల 22వ తేదీ నుంచి తపాలా శాఖ తెలంగాణ సర్కిల్ వ్యాప్తంగా అమలు చేయనుంది. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంతో మన రాష్ట్రంలోని హైదరాబాద్ సర్కిల్, తెలంగాణ సర్కిల్‌లోని నల్లగొండ తపాలా డివిజన్‌లో అమలు చేస్తున్నారు. ఈనెల 22 నుంచి తెలంగాణ సర్కిల్ అంతటా అమలుకు నిర్ణయించారు. ఖమ్మం తపాలా డివిజనల్ కార్యాలయం, 10 సబ్ డివిజనల్ కార్యాలయాలు, ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం హెడ్ పోస్టాఫీసులు, 70 సబ్ పోస్టాఫీసులు, 750 బ్రాంచ్ ఆఫీసుల్లో ఐటీ–2.0 సేవలు అందుబాటులోకి రానుండగా, ఇప్పటికే ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

రెండు రోజులు సేవలకు బ్రేక్

కొత్త సాంకేతిక విధానాన్ని ప్రవేశపెడుతున్న నేపథ్యాన ఈనెల 19, 21 తేదీల్లో తపాలా సేవలు నిలిపివేస్తున్నట్లు ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, ఖాతాదారులు గమనించాలని కోరారు. ఆపై 22వ తేదీ నుంచి నూతన సాంకేతికత అమల్లోకి వస్తుందని తెలిపారు.

ప్రభుత్వ పాల ‘జీరో’ దందా

హద్దులు దాటిన విక్రయాలపై సాగుతున్న విచారణ

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వ పాడి పరిశ్రమ(విజయ డెయిరీ) లక్ష్యాలకు కొందరు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పాల ఉత్పత్తిదారులకు మేలు చేయడం, ప్రజలకు నాణ్యమైన పాలు అందించాలనే భావనతో ఏర్పాటైన డెయిరీ కొందరు అక్రమార్కులకు వరంలా మారింది. కంచే చేను మేసిన చందంగా లొసుగులను ఆసరాగా చేసుకుంటున్న కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. పాలు పక్కదారి పట్టడం, వెన్న అమ్మకాల్లో అక్రమాలు, తప్పుడు బిల్లులు తదితర అక్రమాలు తరచుగా వెలుగుచూస్తున్నాయి. ఇలాంటి వ్యవహారాలు వెలుగు చూసినప్పుడు కొందరు ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నా, మళ్లీ వారు మరో ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. ఇటీవల పాల విక్రయాల్లో కొత్త దందా వెలుగు చూసింది. వరంగల్ డెయిరీలో ప్యాక్ చేసిన పాలను నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మంలో అదీ తక్కువ ధరతో విక్రయిస్తుండగా స్థానిక డిస్ట్రిబ్యూటర్ గుర్తించాడు. ఈక్రమాన విచారణ చేపట్టగా వరంగల్ యూనిట్‌లో తయారైన పాలు, పెరుగును ఇన్‌వాయిస్ లేకుండానే ఇక్కడ విక్రయిస్తున్నట్లు బయటపడింది.

పరిధులు దాటి...

పాల ఉత్పత్తుల విక్రయానికి నిబంధనలు, పరిధి స్పష్టంగా నిర్ధారించారు. కానీ వరంగల్ డెయిరీ నుంచి మహబూబాబాద్ డిస్ట్రిబ్యూటర్‌కు సరఫరా చేసిన పాలను ఖమ్మం తీసుకొచ్చి విక్రయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. డెయిరీ నిర్దేశించిన ధరకంటే లీటర్ పాలు రూ.5 తక్కువకు విక్రయిస్తుండడం గమనార్హం. డెయిరీ నుంచి డిస్ట్రిబ్యూటర్‌కు రూ.67 చొప్పున ఇస్తుండగా, అక్రమ మార్గంలో తీసుకొచ్చిన పాలను రూ.62కే విక్రయిస్తుండడంతో ఖమ్మం యూనిట్‌కు నష్టం వస్తోంది. ఈ వ్యవహారం బయటపడడంతో తక్కువ ధరకు ఎలా అమ్ముతున్నారనే అంశంపై లోతైన విచారణ చేపట్టారు. యూనిట్‌లోని కొందరు ఉద్యోగులు.. డిస్ట్రిబ్యూటర్లతో కుమ్మక్కై ‘జీరో’ దందాకు పాల్పడడంతో ఇది సాధ్యమవుతుందనే ఆరోపణల నేపథ్యాన అధికారుల విచారణలో నిజానిజాలు తేలనున్నాయి. కాగా, ఖమ్మంలో వెలుగు చూసిన అక్రమాలపై డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రాజ్‌ను విచారణ కోసం నియమించగా, ఆయన పాల శ్యాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారు. అంతేకాక అక్రమాలతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మహబూబాబాద్ డిస్ట్రిబ్యూటర్, వరంగల్ యూనిట్ ఉద్యోగులను కూడా విచారించారు. ఇదే సమయాన బుధవారం ఖమ్మం డెయిరీ అధికారులు మధుసూదన్, వెంకటరామయ్య సైతం రంగంలోకి దిగి వివరాలు ఆరా తీశారు. మరోపక్క మొత్తం వ్యవహారంపై ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు కూడా విచారణ చేపడుతున్నారు.

మైనార్టీలను శత్రువులుగా చూస్తున్నారు..

మాస్‌లైన్ జాతీయ నేత ప్రదీప్‌సింగ్



స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న ప్రదీప్‌సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, గుమ్మడి తదితరులు

ఇల్లెందు : కేంద్రంలో నరేంద్రమోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక మైనార్టీలను శత్రువులుగా చూడడమే కాక, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వారిని వేటాడి హతమారుస్తున్నారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ ఆందోళన వ్యక్తం చేశారు. మాస్‌లైన్ దివంగత నాయకులు రాయల చంద్రశేఖర్, గండి యాదగిరి స్మారక స్తూపాలను ఇల్లెందులో బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ఒక శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు సంపద కట్టబెడుతూ ప్రశ్నించిన వారిపై నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

- తొలిదశగా మధిర నియోజకవర్గంలో 11 స్కూళ్ల అభివృద్ధి
- తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ మురళి



మ్యాప్ ఆధారంగా సూచనలు చేస్తున్న చైర్మన్ మురళి, పక్కన కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సూచించారు. కలెక్టరేట్‌లోబుధవారం ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మధిర నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన 11 పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అంతా కృషి చేయాలని తెలిపారు. ప్రతీ మండలంలో అంతర్జాతీయ స్థాయి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు పారంభించాలని కమిషనర్ తరఫున సిఫారసు చేసినట్లు చెప్పారు. ఈమేరకు మధిర నియోజకవర్గంలో 11 పాఠశాలలను గుర్తించగా, రెండు కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. కేటగిరీ–1లోని రెండు పాఠశాలల్లో 1,000 – 1,200 మంది విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడామైదానం, కిచెన్, డైనింగ్ హాల్ నిర్మించాలని సూచించారు. ఈ పనులన్నీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా చేపట్టాలని, ఈ కమిటీల్లో కేవలం తల్లిదండ్రులు 30 మందిని నియమించి సగం మేర మహిళలకు అవకాశం కల్పించాలని చెప్పారు. పీఎం శ్రీ, సమగ్ర శిక్షా అభియాన్, ఉపాధి హామీ నిధులను వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చైర్మన్ సూచించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడగా డీఈఓ ఎస్.సత్యనారాయణ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, విద్యాశాఖ ఈఈ విన్సెంట్‌రావు, ఎంఈఓలు, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ద్రవం.. మెరుగైన ఫలితం!

నానో యూరియాతో లాభాలెన్నో...

- గుళికల యూరియా కొరత నేపథ్యాన విస్తృత ప్రచారం
- వాడకానికి ముందుకొస్తున్న రైతులు



పత్తి పంటపై నానో యూరియా పిచికారీ చేయిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం/నేలకొండపల్లి: పంటల సాగు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. అయితే, పంటల్లో దశలవారీగా ఉపయోగించే యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అవసరానికి సరిపడా కోటా రాకపోవడం, వచ్చినా కొన్నిచోట్ల డీలర్లు మాయాజాలం ప్రదర్శిస్తుండడం.. ఇంకొన్ని చోట్ల భవిష్యత్‌లో కొరత వస్తుందని రైతులు ముందుగా కొనుగోలుకు సిద్ధమవుతుండడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ సమయాన అధికారులు గుళికల యూరియాకు బదులు నానో(ద్రవరూపం) యూరియా వాడకంతో లాభాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఖర్చు తగ్గడమే కాక ఫలితం బాగుంటుందని, రవాణా సులువవుతుందని చెబుతూ అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఇప్పుడిప్పుడే రైతులు నానో యూరియా వాడకానికి ముందుకొస్తున్నారు. అయితే, అధికారులు మరింత విస్తృత ప్రచారం చేస్తే పెద్దసంఖ్యలో రైతులు ముందుకొచ్చే అవకాశముంది.



రైతులకు నానో యూరియా బాటిళ్లు అందిస్తున్న అధికారులు (ఫైల్)

ఏమిటీ నానో?

నానో యూరియా ఒక్క బాటిల్(500 మి.లీ) వినియోగిస్తే 45 కేజీల బస్తా గుళికల యూరియాతో సమానమని చెబుతున్నారు. 45 కిలోల యూరియా బస్తా ధర రూ.270 కాగా, అర లీటర్ నానో యూరియా రూ.225కే లభిస్తుంది. నత్రజనిని అందించే ఈ ఎరువు ద్వారా మొక్కల్లో పచ్చదనం, చురుకైన పెరుగుదల నమోదవుతుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పంటలకు నత్రజనిని అందించేలా రైతులు గుళికల యూరియాను 2–3 సార్లు పైపాటుగా వేస్తున్నారు. ఇందులో నత్రజనిని కేవలం 30–50 శాతం మాత్రమే పంట వినియోగించుకుంటోంది. మిగతాదంతా వృథా కావడం లేదా నేల, గాలి, నీటిని కలుషితం చేస్తోంది. అదే నానో ఎరువు వాడకంతో ఇలాంటివేవీ జరగవు.

పంటలకు ఉపయోగం

నానో యూరియా కణాలు చిన్నవిగా ఉండడంతో పంటకు 80 శాతం కన్నా ఎక్కువగా చేరుతుంది. మొక్కలకు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియను పెంచడం, వేర్లలో కణజాలం వృద్ధికి ఉపయోగపడుతుంది. సంప్రదాయ యూరియాతో పోలిస్తే 50 శాతం, అంతకంటే తక్కువే అవసరమవుతుండడంతో రైతులకు ఖర్చు తగ్గుతుంది. అంతేకాక గుళికల యూరియా బస్తాల రవాణా భారం తగ్గుతుందని, నానో యూరియా 500 మి.లీ నానో యూరియా బాటిల్‌ను సులభంగా ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. ఇది లీటర్ నీటికి 2–4 మి.లీ. కలిపి పంట చురుకైన ఎదుగుదల దశలో ఆకులపై పిచికారీ చేయాలి. ఎకరాకు ఒక లీటర్ నానో యూరియా సరిపోనుండగా, పంట వేసిన 20–25 రోజుల్లో ఓసారి, 20–25 రోజుల తర్వాత మరోమారు పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఈ యూరియా ద్రవరూపంలో ఉండడంతో ఆకులపై పిచికారీ చేసినప్పుడు రంధ్రాల ద్వారా సులభంగా లోనకు వెళ్తూ మొక్క అన్ని భాగాలకు పంపిణీ అవుతుంది. అవసరం మేరకు మొక్కలు పీల్చుకున్నాక మిగతాది మొక్కల ఇతర భాగాల్లో నిల్వ చేయబడి అవసరమైనప్పుడు విడుదలవుతుంటుంది.

మొక్కలకు బాగా పని చేస్తోంది..



ప్రస్తుతం పత్తి, పసుపు సాగు చేస్తున్నా. అధికారుల సూచనలతో నానో ఎరువు వాడుతుండగా పంట ఎదుగుదలకు బాగా పనిచేస్తోందని గుర్తించాం. చేన్లలోకి తీసుకెళ్లడం సులువైంది. యూరియా కొరత సమయాన నానో రావడం ఆనందంగా ఉంది. – అంబటి వెంకటేశ్వరరెడ్డి, నారాయణపురం, ఎర్రుపాలెం మండలం

పంట చేన్లలో చూపించాలి..



ఇన్నాళ్లు పంటలకు గుళికల రూపంలో ఉన్న యూరియా వాడుతున్నాం. కానీ ఈసారి ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా వచ్చిందని చెబుతున్నారు. పంటలకు ఇది ఎలా ఉపయోగపడుతుందో రైతులకు పంట చేన్ల వద్ద వివరిస్తే అర్థమవుతుంది. – మేకల అర్జున్, కోనాయిగూడెం, నేలకొండపల్లి మండలం

పర్యావరణానికి మేలు..



నానో(ద్రవ) యూరియా వాడకంతో భూగర్భ జలాల్లోకి నత్రజని చేరడం తగ్గుతుంది. తద్వారా నేల ఆరోగ్యమే కాక పంటల నాణ్యత పెరుగుతుంది. పంట దిగుబడి సైతం ఎనిమిది శాతం మేర పెరుగుతుంది. నానో యూరియా అన్ని ఎరువుల షాప్‌ల్లో లభిస్తుంది. – పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఎన్‌ఎఫ్‌పీఈ సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వరరావు


పమ్మి వెంకటేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ (ఎన్‌ఏపీఈ) తెలంగాణ సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పమ్మి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. భద్రాచలంలో ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ ద్వైవార్షిక మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఖమ్మం ట్రంక్ రోడ్డు సబ్ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వరరావు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కొత్తగూడెంనకు చెందిన ఆర్.సంతోష్ సర్కిల్ అసిస్టెంట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని అసోసియేషన్ ఖమ్మం డివిజన్ ప్రతినిధులు సీహెచ్ కామేశ్వరరావు, బి.హుస్సేన్, బి.వీరన్న, సీహెచ్‌ఎస్‌వీబీ కుమార్, ఎ. రాంప్రసాద్ తదితరులు అభినందించారు.

ఆన్‌లైన్ రుణం పేరిట బురిడీ

నేలకొండపల్లి: తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామనే ప్రకటన నమ్మిన ఓ యువకుడు మోసపోయాడు. నేలకొండపల్లికి చెందిన ఓ యువకుడికి యాప్ ద్వారా రూ.2 లక్షల రుణం వస్తుందని మెసేజ్ వచ్చింది. తొలుత చార్జీల కింద రూ.4,500 చెల్లించాలని చెప్పడంతో అవి చెల్లించాడు. ఆ తర్వాత రుణం మంజూరైందంటూ రూ.9,500 జీఎస్టీ చెల్లించాలని చెప్పడంతో యువకుడు ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదు. దీంతో యువకుడు మోసపోయినట్లు గ్రహించి తెలిసిన వారికి చెప్పుకుని వాపోయాడు.

పాలేరు వాసికి డాక్టరేట్


డాక్టరేట్‌తో మహేశ్‌గౌడ్

కూసుమంచి: మండలంలోని పాలేరుకు చెందిన అనంతుల మహేశ్‌గౌడ్ కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. బయ్యారం ప్రాంతంలోని ఇనుప ధాతువుపై ప్రొఫెసర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఆయనకు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

మొబైల్ యూనిట్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ


సత్తుపల్లి: యూనిట్‌లో పరిశీలిస్తున్న కళావతిబాయి

సత్తుపల్లి: మండలంలోని చంద్రాయపాలెంలో ఐటీడీఏ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కంటైనర్ మొబైల్ మెడికల్ యూనిట్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి బుధవారం పరిశీలించారు. ఈ క్యాంప్ ద్వారా అందుతున్న వైద్యసేవలపై ఆరా తీసిన ఆమె సిబ్బందికి సూచనలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, మెడికల్ ఆఫీసర్ ఆర్.అవినాష్, సూపర్‌వైజర్లు శారారాణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో నూరు శాతం వైద్యసేవలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని పీహెచ్‌సీల్లో నూరుశాతం వైద్యసేవలు అందించాలనిడీఎంహెచ్‌ఓ కళావతిబాయి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె ఖమ్మం డివిజన్‌లోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కొన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఇమ్యూనైజేషన్, ప్రసవాల్లో వెనకబడినందున తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్లు నిత్యం పర్యవేక్షించాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చందునాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు, డెమో సుబ్రహ్మణ్యం, స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ దుర్గ, నాగరాజు, రవితేజ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సొసైటీ.. ప్రగతిలో మేటి..

ప్రగతి పథంలో నాగులవంచ సొసైటీ

- పీఏసీఎస్‌లో 2,400 మంది సభ్యులు..
- ప్రస్తుతం రూ.1.20 కోట్ల ఆదాయం
- రుణాలు, పంటల కొనుగోళ్లలో రైతులకు చేయూత
- నాబార్డు నుంచి ఉత్తమ సొసైటీగా అవార్డు



నాగులవంచ సొసైటీ కార్యాలయం

చింతకాని: మండలంలోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ప్రగతి పథంలో కొనసాగుతోంది. రైతులకు పంట రుణాల పంపిణీ, ఎరువులు, విత్తనాల సరఫరా చేయడమే కాక ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. అలాగే, రైతులకు ఆన్‌లైన్ సర్వీసుల కోసం గతేడాది కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయడంతో సేవలు విస్తృతమయ్యాయి. 15 ఏళ్లగా సంఘం లాభాల బాటలో నడుస్తుండడంతో తాజాగా నాబార్డు ఉత్తమ సొసైటీగా అవార్డు ప్రకటించింది. హైదరాబాద్‌లో మంగళవారం ఈ అవార్డును సొసైటీ చైర్మన్, సీఈఓ అందుకున్నారు.

30 మంది సభ్యులతో ఏర్పాటు

నాగులవంచ పీఏసీఎస్ పరిధిలో నాగులవంచ, చిన్నమండవ, సీతంపేట, తిమ్మినేనిపాలెం, తిరుమలాపురం, నాగులవంచ రైల్వేకాలనీ, రేపల్లెవాడ గ్రామాలు ఉన్నాయి. 1963 నవంబర్ 6వ తేదీన 30 మంది సభ్యులతో రూ.6 వేల వాటాధనంతో సొసైటీ ఏర్పడగా ఇప్పుడు 2,400 మంది సభ్యులు, రూ.1.22 కోట్లు వాటాధనం కలిగి ఉంది. పీఏసీఎస్ ద్వారా 1,198 మంది రైతులకు 2025–26 ఖరీఫ్ సీజన్‌కు రూ.8.64 కోట్లు పంట రుణాలు ఇవ్వడమే కాక మరో 110 మంది రైతులకు రూ.60 లక్షలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సంఘంలోని 950 మంది రైతులు సేవింగ్ డిపాజిట్ల కింద రూ.42.50 లక్షలు పొదుపు చేసుకున్నారు. అలాగే 870మంది రైతుల డిపాజిట్లు రూ.1.26కోట్లు ఉన్నాయి. పీఏసీఎస్ ద్వారా పంటరుణాలు తీసుకున్న 1,162 మందిలో 824 మందికి రూ.6.02 కోట్ల మేర రుణమాఫీ అయింది.

నికర ఆదాయం రూ.1.20 కోట్లు

సంఘం ప్రస్తుత నికర ఆదాయం రూ.1.20 కోట్లుగా నమోదైంది. డీసీసీబీలో వాటాధనం రూ.1.50 లక్షలు ఉండగా, డిపాజిట్లు రూ.1.95 కోట్లు ఉన్నాయి. 2024 ఖరీఫ్ సీజన్ నుంచి పీఏసీఎస్ ద్వారా రూ.5.50 కోట్ల విలువైన ఎరువులు, విత్తనాల వ్యాపారం నిర్వహించారు. అలాగే, 600 మంది రైతుల వద్ద నుంచి గత రెండేళ్ల కాలంలో రూ.20.50 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశారు.

గోదాం నిర్మాణం

సంఘంలో సభ్యులైన రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా సొసైటీ ఆవరణలో అగ్రి డెవలప్‌మెంట్ స్కీం కింద నాబార్డు అందజేసిన రూ.60 లక్షలతో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన గోదాంను మూడేళ్ల కిందట నిర్మించారు. ఇందులో 15 మంది రైతులు 995 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు నిల్వ చేసి తనఖా రుణంగా రూ.80 లక్షలు తీసుకున్నారు. 2009–10లో 350 సభ్యులు ఉన్న సమయాన పీఏసీఎస్‌కు రూ.25 లక్షల నష్టం రాగా.. అప్పటి నుంచి వెనుతిరిగి చూడకుండా అభివృద్ధి బాటలో పయనిస్తుండడంతో నాబార్డు అవార్డు ప్రకటించింది.

15 ఏళ్లుగా లాభాల బాట..



సభ్యుల సహకారంతో పీఏసీఎస్ 15 ఏళ్ల నుంచి లాభాల బాటలో పయనిస్తోంది. సన్న, చిన్నకారు రైతుల కోసం జనరిక్ ఔషధ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించాం. నాలుగేళ్లుగా ఆడిట్‌ల్లో 'ఏ' గ్రేడ్ సంఘంగా నమోదవుతోంది.

–యాలముడి శ్రీనివాసరావు, సీఈఓ, పీఏసీఎస్

మెరుగైన సేవలు



రైతులకు పంట రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలను అందిస్తున్నాం. ఖరీఫ్‌లో రూ.8.64 కోట్ల పంట రుణాలు జారీ చేశాం. రూ.1.20 కోట్ల ఆదాయంతో ఉండగా, నాబార్డు అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉంది.

–నల్లమోతు శేషగిరిరావు, చైర్మన్, పీఏసీఎస్

వేగంగా రుణాల జారీ



సభ్యులకు త్వరగా రుణాలు జారీ చేస్తుండడం, రికవరీ కూడా బాగుండడంతో సంఘం అభివృద్ధి సాధిస్తోంది. ఖరీఫ్, రబీలో ధాన్యాన్ని ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తున్నారు. పంటల నిల్వకు గోదాం కూడా నిర్మించారు.

–కంభం శేషయ్య, పీఏసీఎస్ సభ్యుడు

నిజాయితీగా సేవలతో ఉన్నత స్థాయికి..


సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంఅర్బన్: నిజాయితీతో ప్రజలకు సేవలందించడం ద్వారా ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఖమ్మంలోని ఐటీ హబ్‌లో ఇందిరా మహిళాశక్తి ద్వారా డిజిటల్ ఇండియా మోడల్ సీఎస్‌సీల నిర్వాహకులకు ఇస్తున్న శిక్షణను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 70 మంది మహిళా సంఘాల సభ్యులకు తరుణి హాట్‌లో శిక్షణ ఇవ్వగా, ఇంకొందరికి ఐటీ హబ్‌లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా ఈడీపీ, ఐటీ అంశంలో శిక్షణ ఇప్పించామని తెలిపారు. ఆధార్‌కార్డ్, బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాల సేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరువ చేసేలా కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటుకు చేయూతనిస్తామని చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన వారితో కలిసి కేక్ కట్ చేసిన కలెక్టర్ వారికి బయోమెట్రిక్ యంత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌సీ ప్రాజెక్టు మేనేజర్ బి.హరికృష్ణకుమార్, టాస్క్ ఆర్‌ఎం అశోక్‌కుమార్‌నాయక్‌తో పాటు షేక్ ఫయాజ్, సురేశ్‌కుమార్, బాలూ ప్రవరాఖ్య, శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటలలకు ప్రాణం.. రైతుల్లో హర్షం


పెనుబల్లి: గోదావరి జలాల రాకతో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

పెనుబల్లి/కల్లూరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగవుతున్న వరి పంట వర్షాభావ పరిస్థితులతో ఎండిపోయే దశకు చేరగా.. సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు విడుదల చేయడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు నాట్లు వేయగా వరుణుడు ముఖం చాటేశాడు. మరోపక్క సాగర్ జలాల విడుదలలో జాప్యం జరుగుతుండగా, ఇంతలోనే సీతారామ ద్వారా గోదావరి జలాలు విడుదలయ్యాయి. ఏన్కూరు వద్ద లింక్ కెనాల్ మీదుగా కల్లూరు డివిజన్‌లోని మధిర బ్రాంచ్ కెనాల్ పుణ్యపురం మేజర్, మైనర్ కాల్వలకు చేరుతోంది. అలాగే, పెనుబల్లి, వేంసూరు మండలాలకు ప్రధాన కాల్వ ద్వారా నీరు సరఫరా చేస్తుండగా బుధవారం సాయంత్రానికి సాగర్ 80వ కి.మీ. వరకు నీరు చేరింది. గురువారం ఉదయం 101 కి.మీ. మధిర మేజర్ వరకు నీరు చేరే అవకాశముందని భావిస్తున్నారు. ఈ సందర్భంగా పెనుబల్లి మండలం కారాయిగూడెంలో సాగర్ కాల్వ వద్ద రైతులు సంబురాలు జరుపుకున్నారు.

మార్కెట్ పరిశీలన

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్‌ను బుధవారం రాష్ట్ర పరిశీలకులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బీ.ఎస్.రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.గణేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గత ఖరీఫ్, యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమయాన సమకూర్చిన పరికరాలు, ఎదురైన ఇబ్బందులను తెలుసుకున్నారు. యంత్ర పరికరాల వినియోగంలో సమస్యలు, వచ్చే ఏడాది చేయాల్సిన మార్పులపై ఉద్యోగులతో చర్చించారు. ఆ తర్వాత మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, సొసైటీల సీఈఓలు, ఐకేపీ, మార్కెట్ ఉద్యోగులతో పాటు రైతులతో సమావేశమై కొనుగోలు కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలు, అందించిన పరికరాల వివరాలపై సమీక్షించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, ఉద్యోగి రామకృష్ణ, మార్కెట్ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడుకు చెందిన గుగ్గల రవి కానరాకుండా పోవడంతో ఆయన భార్య కవిత ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. టాటా ఏస్ వాహనం అద్దెకు తిప్పే రవి రోజులాగే ఈ నెల 11న వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఫలితం లేక ఆయన భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

పీఏసీఎస్‌లో టెస్కాబ్ అధికారుల తనిఖీ

చింతకాని: మండలంలోని నాగులవంచ పీఏసీఎస్‌ను టెస్కాబ్(తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్) అధికారులు బుధవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా సొసైటీ ద్వారా రైతులకు అందిన రుణాలు, ఎరువులు, విత్తనాల విక్రయాలు, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే, ఎరువులు, విత్తనాల నిల్వలు,గోదాంలో రైతులు నిల్వ చేసిన మొక్కజొన్నను సైతం పరిశీలించారు. టెస్కాబ్ ఏజీఎం షేక్ అనూష, సీనియర్ మేనేజర్ రజిని, మేనేజర్ వెంకటయ్య, డీసీసీబీ ఏజీఎం రాధిక, డీసీసీబీ చింతకాని బ్రాంచ్‌సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు, సీఈఓ యాలముడి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొరవడిన పర్యవేక్షణ

- బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్లలో సమస్యల తిష్ట
- అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థుల అవస్థలు


ఖమ్మంలోని 'ఏ'హాస్టల్‌లో విద్యార్థులు పడుకునే ప్రాంతం వద్దే గ్యాస్ స్టౌ, వంట సామగ్రి

ఖమ్మంమయూరిసెంటర్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన వసతి, భోజనంతో కూడిన విద్యనందించేందుకు ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను నిర్వహిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది తీరుతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతుందనే విమర్శలు వస్తున్నాయి. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన నడుస్తున్న వసతి గృహాలను పర్యవేక్షించాల్సిన డివిజన్ స్థాయి అధికారులు జిల్లా కేంద్రం దాటకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జిల్లాలో మొత్తం 20 బీసీ ప్రీమెట్రిక్ వసతిగృహాలు ఉండగా 1,521 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

కనీస సౌకర్యాల కరువు

వసతిగృహాల్లో తగినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోగా శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం, దుప్పట్లు కూడా అందడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో పాతబడిన భవనాలు, సరిపోని వెంటిలేషన్, విద్యుత్ సమస్యల నడుమే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ప్రధానంగా వర్షాకాలంలో దోమల బెడద వేధిస్తోందని, అనారోగ్యం బారిన పడిన వారికి సరైన చికిత్స కూడా చేయించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఏడాది వసతి గృహాల్లో మెరుగైన స్థాయిలో ప్రవేశాలు నమోదు కాలేదని, ఖమ్మం డివిజన్ పరిధి ముదిగొండ వసతిగృహంలో 23 మందే చేరడంపై విమర్శలు వస్తున్నాయి.

పర్యవేక్షణ లోపంతో..

వసతిగృహాలను పర్యవేక్షించాల్సిన డివిజన్ స్థాయి అధికారులు జిల్లా కార్యాలయంలోనే ఉంటూ క్షేత్రస్థాయికి వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయి పర్యటనలు చేయకపోవడంతో వసతిగృహాల్లో సమస్యలను గుర్తించలేక పరిష్కారం కావడం లేదు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి తరచుగా వసతిగృహాలను తనిఖీ చేస్తున్నా, డివిజనల్ అధికారులు తమ పని కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే అపవాదు ఉంది.

అరకొర వసతుల నడుమే..

ఖమ్మం ముస్తఫానగర్‌లోని బీసీ బాలుర 'ఏ'హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరగా, కొత్త భవనానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిధులు కేటాయించారు. దీంతో పాత భవనాన్ని తొలగించినప్పుడు విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు ఉన్న భవనాన్ని ఎంపిక చేయాల్సింది పోయి 26వ డివిజన్‌లోని మున్సిపాలిటీ కమ్యూనిటీ హాల్‌ను వసతిగృహంగా మార్చారు. ఇందులో 68 మంది విద్యార్థులు ఉన్నట్లు చెబుతున్నా.. 40 – 50 మంది దాటడం లేదని సమాచారం. ఇక వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థుల బసకు వేర్వేరు గదులు లేకపోవడంతో హాల్‌లోనే వంట చేయడం, అక్కడే భోజనం వడ్డించడం, ఆ తర్వాత పడుకోవాల్సి రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇక టాయిలెట్లు కూడా నాలుగే ఉండడంతో విద్యార్థులు పలువురు ఇంటిబాట పట్టినట్లు సమాచారం. ఈ అంశంపై ఖమ్మం డివిజనల్ అధికారి ఈదయ్యను వివరణ కోరగా కమ్యూనిటీ హాల్‌లో గదుల నిర్మాణానికి మున్సిపల్ అధికారులకు లేఖ రాశామని తెలిపారు. అలాగే, ముదిగొండ వసతిగృహం ప్రైవేట్ భవనంలో ఉండడంతో విద్యార్థులు చేరలేదని వెల్లడించారు.

ప్రేమించిన యువతి తండ్రి బెదిరించాడని ఆత్మహత్య

ఖమ్మంరూరల్: ప్రేమించిన యువతి తండ్రి యువకుడిని మందలించడమే కాక చంపుతామని బెదిరించడంతో గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. రూరల్ మండలం పడమటితండాకు చెందిన తమ్మోజు ఉపేంద్రాచారి – సరస్వతి కుమారుడు విఘ్నేశ్‌చారి (20) ఖమ్మంలో వెల్డింగ్ పనిచేస్తున్నాడు. ఖమ్మానికి చెందిన ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరు ఫోన్‌లో మాట్లాడుకుంటుండగా గమనించిన యువతి తండ్రి ఇటీవల విఘ్నేశ్‌ను కలిసి మాట్లాడటం మానేయకపోతే చంపేస్తామని బెదిరించినట్లు తెలిసింది. దీంతో భయపడిన యువకుడు ఈనెల 3న గడ్డి మందు తాగగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఘటనపై యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

ఖమ్మంవైద్యవిభాగం: ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందగా, వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ ఆమె బంధువులు ఆందోళన నిర్వహించారు. కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన వడిత్యా పీక్లీ (59)కు గర్భసంచి సమస్య ఉండటంతో నెహ్రూనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. గత వారం ఆమెకు వైద్యులు ఆపరేషన్ ద్వారా గర్భసంచి తొలగించగా, బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ పీక్లీ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగగా టూటౌన్ పోలీసులు చేరుకొని నచ్చజెప్పారు. ఆస్పత్రి యాజమాన్యంతో మృతురాలి బంధువులు చర్చలు జరిపినా యాజమాన్యం తమ తప్పులేదని స్పష్టం చేసింది. దీంతో ఇరువర్గాల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థానిక సంస్థల్లో ఎన్నికల్లోనూ కలిసే పోటీ

సీపీఐ నేతలతో వైరా ఎమ్మెల్యే రాందాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐతో తనకు 30 ఏళ్లుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, తాను ఏ స్థాయిలో ఉన్నా ఆ అనుబంధం కొనసాగిస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సీపీఐ, కాంగ్రెస్ వైరా నియోజకవర్గ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయాన తనకు సీపీఐ నేతలు అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైరా నియోజకవర్గంలో సీపీఐ, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సీపీఐకి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ.. అనేక రాజకీయ అంశాల్లో కాంగ్రెస్‌తో తాము ఏకాభిప్రాయంతో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ మౌలానా, ఎర్రాబాబు, వడ్డే నారాయణరావు, సూరంపల్లి రామారావు, అజ్మీర రామ్మూర్తి, రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్‌కుమార్, దొండపాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా ఫీజు రీయింబర్స్‌మెంట్

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన చలో కలెక్టరేట్.. అడ్డుకున్న పోలీసులు



కలెక్టరేట్ ముట్టడికి ప్రదర్శనగా వెళ్తున్న విద్యార్థులు, నాయకులు


నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులకు బోధనా రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయడమే కాక విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన బుధవారం చలో కలెక్టరేట్ నిర్వహించారు. విద్యార్థులు, నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. గేటు బయట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. నాలుగేళ్లగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఇవ్వకపోగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ కారణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు నాగుల్‌మీరా, మధు, శివనాయక్, వంశీ, మనోజ్, సురేశ్, పవన్, వెంకటేశ్, లక్ష్మణ్, నాగేంద్రబాబు, గోపి, నరేందర్, పావని, మల్లిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు అండగా 'కుటుంబ భరోసా'


సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

కారేపల్లి: సాంకేతికను అందిపుచ్చుకుంటేనే ఫొటోగ్రాఫర్లు వృత్తిలో రాణిస్తారని ఫొటో, వీడియోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్ తెలిపారు. కారేపల్లి మండల అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరగగా ఆయన పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లంకి పిచ్చయ్య, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి సైదిరెడ్డిని సన్మానించాక హుస్సేన్ మాట్లాడుతూ.. ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమం కోసం కుటుంబ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రూ.10 చెల్లిస్తే రూ.1.70 లక్షలు, రూ.100 చెల్లిస్తే రూ.2.50 లక్షలు బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 138 మంది కుటుంబాలకు రూ.3 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చావా సంపత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మరగాని వెంకట్‌తో పాటు నీరుడి తిరుపతిరావు, మరగాని వెంకట్, నాగరాజు దేవర, వేముల నర్సింహారావు, కనికొండ అశోక్, తిరుమల్‌రావు, కనకారావు, బాబా, కమతం రఘు, ఎస్.ఆదినారాయణ, లక్ష్మణ్, రియాజ్, సీహెచ్.రాధాకృష్ణ, కుమ్మరి పాపారావు, కన్ని, అన్వర్, కొండ జ్యోతిబాబు, మేదరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఎన్‌సీడీ పీఓ తనిఖీ


ఉద్యోగులతో మాట్లాడుతున్న పీఓ రామారావు

ముదిగొండ: ముదిగొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి రామారావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన ఆయన ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షలు, వ్యాక్సిన్ల నిల్వలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రజలు జీవన విధానం మార్చుకుని ప్రతీరోజు వ్యాయామం చేయడం, ఆహారం ఉప్పు తగ్గించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మండల వైద్యాధికారి అరుణాదేవి, ఉద్యోగులు సత్యవతి, నాగరాజకుమారి పాల్గొన్నారు.

కోమాలో నాలుగు నెలల బాలుడు

దాతలు చేయూతనివ్వాలని తల్లిదండ్రుల వినతి


కోమాలో ఉన్న బాలుడు

నేలకొండపల్లి: నిరుపేద కుటుంబానికి చెందిన నాలుగు నెలల బాలుడు తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ కోమాలోకి వెళ్లాడు. వైద్యంకోసం ఆయన తల్లిదండ్రులు అందినకాడికల్లా అప్పులు తెచ్చినా ఫలితం లేక దాతలు చేయూతనివ్వాలని కోరుతున్నారు. మండలంలోని అప్పలనరసింహాపురానికి చెందినవ్యవసాయ కూలీలు పార్తబోయిన వెంకటేశ్వర్లు – రాధిక దంపతులకు నాలుగు నెలల కిందట కమారుడు జన్మించాడు. ఆయనకు బుధవారం జ్వరం రావడంతో ఖమ్మంలో చికిత్సచేయిస్తుండగా ఫిట్స్ వచ్చాయి. ఈ క్రమంలోనే కోమాలోకి వెళ్లాడు. దీంతో ఇప్పటి వరకు రూ.లక్ష అప్పు తెచ్చిచికిత్స చేయించినా ఫలితం లేక పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో హైదరాబాద్ తీసుకెళ్లినప్పటికీ కుమారుడి చికిత్స కోసం చేతిలో చిల్లిగవ్వ లేక వెంకటేశ్వర్లు దంపతులు రోదిస్తున్నారు. దాతలు 81794 32013 నంబర్‌కు ఫోన్ పే / గు గూల్ పే ద్వారా నగదు పంపిస్తే తమ బిడ్డకు ప్రాణం పోసినట్లవుతుందని కోరుతున్నారు.